# ‘మీ రిద్దరూ పెండ్లాడుకోండి విడాకులు మాత్రం నేనే యిస్తా’

• టి. డి. ప్రసాదరావు •

పరీక్షలంటే యేమిటో నాకు వణుకు వల్లమాలిన భయం. హాస్టలులో ఉన్న నా మిత్రులంతా హేళన చేస్తుంటారు నన్ను నా భయాన్ని చూచి. వాళ్ళేమనుకున్నా సరే నన్నుమాత్రం ఫేలయ్యానంటే పరువుపోతుందన్న బాధ పరీక్షలవక ముందు నుండి పీడిస్తుంది పట్టుదలతో చదివిన కొద్దీ ప్రతీది అయోమయం. చదివినది చదవనిది అంతా అలుక్కుపోయి ఒక్కలాగే ఉన్నాయి కొంచెమేదైనా మార్పిస్తే చదువు సరిగ్గా నడవడానికి వీలుంటుదనుకొని, ఎటువంటి మార్పివ్వాలని ఆలోచించాను ఆహ్లాదం, ఆనందం కలుగజేసే సినిమామీదకు వెళ్ళింది మనసు

అదొక అద్భుతమైన ఆంగ్లేయ చిత్రం. ఆ హాలులో పురుషులకు ప్రత్యేక స్థలవిభజన లేకపోవడంచేత స్త్రీ పురుషులు భేదంలేకుండా సరిసమానంగా కూర్చున్నారు కొంతసేపటికల్లా నడచిపోతూంది చలనచిత్రం అతివేగంగా. కనివిని యెరుగని సంఘటనలు ఎన్నో జరిగిపోతున్నాయి. సాధారణంగా చిత్రాల్ని చూడని నాకు యింకొక లోకంలో యెక్కడో ఉన్నట్లు అనిపిస్తుంది, చూస్తుంటే. అంటే మైకం కొంచెం కొంచెంగా కప్ప ప్రారంభిస్తుందన్న మాట.

ఇంతవరకూ ప్రక్కనే కూర్చున్న ఆధునిక అందాల యువతిని ప్రక్కచూపులతో, క్రీగంటితో, దొంగతనంగా, ఉద్దేశ నిరుద్దేశాలతో చూచిన నేను యిప్పుడు తెరమీది బొమ్మలను తదేకదృష్టితో పరీ చూస్తున్నాను ప్రక్కనుండి వచ్చే సువాసనకూడా యిప్పుడు తెలియడంలేదు ఒకవేళ ముక్కుకూడా చిత్రాన్నే చూస్తుందేమో. ఎంతసేపయి ఆ యువతి నా భుజాన్ని తట్టుతుందో కూడా తెలిసిందికాదు. వీటి అన్నిటి బట్టి చూస్తే నాకు చైతన్యంకూడా నశించిందనుకుంటాను. ఆ సుందరాంగి వైపు చూడకుండానే, ఆమిచ్చిన సిగరెట్టు ముట్టించాను, అలవాటు లేకపోయినా. ధ్యాస లేదు. కృతజ్ఞతాసూచక ప్రవర్తన లేదు.

పిడుగు.

“జాన్ నిజము చెప్పేయి. మరేమీ అనుకోనులే” అన్నాడు పీటరు.

“నిజమే చెప్తాను నీ వేమనుకున్నా లేకపోయినా”

“అయితే హెలెను నిన్ను ప్రేమిస్తుందా లేక ఆమెను నీవు ప్రేమిస్తున్నావా?”

“ఆమెను నేను ప్రేమించడం గురించి నేను నిజంగా యేమీ చెప్పలేను. నన్ను ఆమె ప్రేమించడం గురించి, ఆమెనే అడుగు. ఇదిగో ఆవిడ వస్తుంది కూడాను,”

నా నోటిలో సిగరెట్టు కాలుతూనే ఉంది. నాకేమిటో సినిమా అద్భుతం. ట్వీడు సూటు, సిల్కు టై, బంగారం సిగరెట్టు పెట్టె, నాణ్యమైన చేతి గడియారం, కుషను కుర్చీ, అన్నిటికీ మించిన దంతపు టేబిలుమీద బ్రాంది బుడ్డీ. బుడ్డీలోని బ్రాంది సేవిస్తూ, హెలెనును చూస్తున్నాడు పీటరు లోగగాను కోపం, రౌద్రం యివన్నీ యెంత సుళువుగా కప్పిపుచ్చేసుకున్నాడు!

చిత్ర విచిత్రమైన ఆహ్వానం, సరదా సంభాషణలు జరిగాయి మా ముగ్గురకు.

“ఓ అందాలకుప్పా, జీవితనౌకా” అని సంబోధించాడు పీటరు హెలెనుని.

“ఆఁ ఏమి కావాలి” అంది.

“ప్రేమిస్తున్నావా, నన్ను”

“లేదు”

“ప్రేమిస్తున్నావా, జానుని”

“అవును”

“నన్ను పెండ్లాడి, హిమవత్పర్వత శిఖరాన్ని స్వర్గసౌధంలో సర్వసుఖానికి చక్రవర్తిగా చేస్తానన్నది నీవు కావా?”

“అవును, నేనే”

నా గుండెల్లో దడ అధికమైంది. విమానంలోంచి జారి భూమిమీద పడిపోతున్నట్టుంది.

"లేదని మరెందుకంటావు ?"

"ఆడిన మాట తప్పను. నిన్ను పెండ్లాడలేను. జానుని ప్రేమిస్తాను."

"నీవు నాకు భార్యవు అంటే అర్ధాంగివి అవడమే నాకు చాలు. పెండ్లికి సిద్ధంగా ఉండు" అంటూ ఈల ఊదుకుంటూ ఆనందంతో తూగులాడుతూ గది విడిచాడా పీటరు.

"జాన్ నీవే జాన్ నా ప్రియుడవు. నిన్నే ప్రేమించానోయి. ఎందుకలా క్రిందిచూపులు చూసుకుంటూ విరక్తిచెందినవాడిలా ప్రపంచాన్ని అసహ్యించుకుంటావు. ఇదిగో, నా" మృదువైన ఆమె కరాలు నా కంఠాన్ని చుట్టేసాయి. సువాసనలీనే ఆమె నిట్టూర్పులతో నా ముఖాన్ని యెన్నిసార్లు ముద్దాడిందో. పాపం అలసిపోయి నా భుజాలమీద వాలిపోయింది. నేను చలించలేకపోయాను. మాటాడలేకపోయాను. రాతి విగ్రహంలా అలానే ఉన్నాను.

... ... ...

హెలెను నిజంగా పెండ్లాడి సుఖంగా ఉందా అన్నే అనుమానం, నాకేమిటో హృదయాన్ని పీడిస్తుంది. మాంచినిద్రలో మెలకువ వచ్చింది. బయలుదేరాను కారులో. అర్ధరాత్రి అంధకారబంధురం పీటరు భవన ప్రహారీగోడను గెంతి లోన ప్రవేశించాను. ఏదో ఒక గదిలోంచి ఎవరో ఏడుస్తున్నట్టు వినిపించింది. మెల్లగా సమీపించాను.

"ప్రియా, జాన్. ఎక్కడున్నావో నన్ను యమబాధలు పెట్టే పీటరు చెరనుండి విడిపించవా? పీటరును ప్రేమించలేను, వాడెన్ని బాధలు పెట్టినాసరే."

నా హృదయం బ్రద్దలయిపోతూంది. ఒక నిముషము ఒక యుగంగా కనిపిస్తుంది. ఆలస్యమైపోతూంది. ఎలాగు హెలెనును చెరవిడిపించడం. కష్టసమయంలో ధైర్యం వీడరాదు. వీడను. గది తాళంకప్ప లాగిచూసేసరికల్లా టక్కున వీడిపోయింది. చీకటిరాత్రయినా వెలుతురు ఎక్కడనుండి వచ్చిందో. ఇదంతా ప్రకృతి సానుభూతి కాబోలు.

"హా ప్రాణనాథా. వచ్చావా ?" కళ్లు తేలవేసి మూర్ఛపోతూంది. మెల్లగా ఆవిడ్ని లేవనెత్తి వీధిలోకి పోవడానికని తప్పటడుగులు వేసుకుంటూ ద్వారం సమీపించాను. హెలెను నా మీద సొలసి వాలిపోయివుంది.

ఇంకొక దుర్భేద్యమైన సంఘటన. పీటరు ఎదుట పిస్తోలుతో. హెలెనుకు తెలివొచ్చింది గాబోలు. "పీటరు" అంది అతి దీనంగా నిట్టూరుస్తూ.

కన్నీటిధారలు కారుతూనే ఉన్నాయి. సూర్యగోళాన్నికూడా ఆర్పేసే శక్తి వీటిలో ఉంటేనేం.

"క్షమించు. నీ మానవహృదయాన్ని చూపు. నిన్ను ప్రేమించలేను. నా ప్రియుడు, ప్రాణదాతకూడాను, జాన్. అతన్నే ప్రేమించాను. మమ్మల్ని వెటకుపోనియ్యి నీకు ధర్మముంటుంది నన్ను నీవు నిజంగా ప్రేమిస్తుంటే నా ఈ కోర్కెను తీరుస్తావు."

పీటరు ఏమనుకున్నాడో "పొండి మీ యిద్దరు పెండ్లాడుకోండి విచారులుమాత్రం నేనే యిస్తాను" అంటూ ఆ స్థలం విడిచిపెట్టాడు.

హెలెను నేనూ ఒకరినొకరు పట్టుకొని కారులో కూర్చొనిపోతున్నాము చర్చివైపునకుంటూను.

... ... ...

సినిమాహాలు దేదీప్యమానంగా వెలుగుతూంది. ఆట ఆఖరవడంచేత ఎవరుమట్టుకువారు లేచిపోతున్నారు. నేనెలా వెళుతున్నానో, ఎక్కడకు వెళుతున్నానోకూడా తెలియడంలేదు. మామూలుగా సిగరెట్టుపొగ లాగుదామంటే పెదాలకు వ్రేళ్లు తగులుతున్నాయిగాని పొగ రావడంలేదు. పైపై సవరించుకుందామంటే కాలరులేని చొక్కాయి దొరుకుతుంది. హేటు తీదామని చేయి బుర్రవైపు పోనివ్వగా హేటులేని తల తగిలింది ఇదేమిచోద్యమని పరికాయించగా సినిమామత్తు వదలిందికాబోలు యింకేముంది నేమి నేను సినిమా హాలులో నా ప్రక్క కూచున్న ఆధుని అందాల అమ్మాయి నడుమును నా కుడిచేయి చుట్టడం గ్రహించాను. ఆమె నా చేయిని పట్టుకొని ఉండడంకూడా తెలుసుకున్నాను. "బ్రాడువే రోడుమీద అదీను. నా స్వప్నిక జగత్తులో పడేటప్పటికల్లా నా ప్రవర్తన నాకే విడ్డూరమనిపించింది. ఆమెకూడా నాలాగే నిద్రాంతపోయిందనుకుంటాను నా చేయిని విదకలించుకుంటుంది. సినిమా యింద్రజాలంలోంచి బైటపడుతున్నాం యిద్దరమూ. వణికే కంఠంతో "పొరపాటు క్షమించండి" అని ఆమెకు విన్నవించుకుంటూ రివ్వున సమీపంలో ఉన్న మా హోస్టలు చేరుకొని గదిలో కెళ్ళి తలుపులు బిగాయించుకున్నాను.